క్లుప్తంగా

మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లి శివారులోని బాపనోళ్ల మైసమ్మ ఎమ్మెల్యే మేఘారెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా చిలకటోనిపల్లి డీలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బాలచంద్రయ్య, రాంచంద్రయ్యగౌడ్, బాబురెడ్డి, నారాయణ, వెంకటేష్, వివేక్ తదితరులు ఉన్నారు.

రామోజీరావుకు నివాళి



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్ ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు ఆదివారం ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రమేష్, రవీందర్‌గౌడ్, బాలరాజు, విజయ్‌కుమార్, గోపి, అతిక్, కిరణ్‌గౌడ్, రాజేష్, పరశురాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ బిల్లులు జారీ



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా 200 యూనిట్లలోపు వినియోగదారులకు జీరో బిల్లులను అందజేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ నర్సింహులు తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో జీరో బిల్లులను అందించలేకపోయామని తెలిపారు. ఈమేరకు ఆదివారం జూనియర్ లైన్‌మెన్లు, విద్యుత్‌ సిబ్బంది వినియోగదారులకు జీరో బిల్లులను అందించారు. ఈసందర్భంగా వినియోగదారులు హర్షం ప్రకటించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష



కొత్తకోట రూరల్: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. అధికారులు కొత్తకోటలోని నివేదిత జూనియర్, డిగ్రీ కళాశాల రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల 30నిమిషాలకు పరీక్ష సమయం కేటాయించగా అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ రాంబాబు, ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి 144సెక్షన్ విధించడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలలో 336మంది అభ్యర్థులకు గానూ 253మంది హాజరు కాగా 83 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 360మంది అభ్యర్థులకు గానూ 302మంది హాజరు కాగా 58మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

నిలిచిన రాకపోకలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం మైసమ్మ దేవతను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సొంత వాహనాలలో పెద్ద ఎత్తున తరలి రావడంతో మండల కేంద్రంలో వాహనాలు నిలిచిపోయి అరగంట పాటు రోడ్డుపైనే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వాహనాలను రోడ్డుపై నిలిపివేయకుండా చర్యలు తీసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఆదివారం మృగశిర కార్తి రావడంతో నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాలలో తరలివచ్చారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ కూడలిలో కొబ్బరికాయలు, కోళ్ళు, వంట సామాగ్రి తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీసు అధికారులు పెద్దకార్పాముల రోడ్డుపై కోళ్ళు, ఇతర వస్తువులను విక్రయించకుండా కార్పాముల మిట్ట వద్ద విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తే ట్రాఫిక్ సమస్య రాదని పలువురు పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ వచ్చే వాహనాలను ముష్టిపల్లి రోడ్డు నుంచి మర్రికల్, పెద్దకార్పాముల మీదుగా మైసమ్మ జాతరకు వెళ్లేవిధంగా వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఉంటుంది. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ వెనుక ఉన్న రోడ్డు నుంచి వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశాలు ఉన్నాయి.

ధర్మాపురం గోస



ధర్మాపురం గ్రామ వ్యూ

- జీటీకి నోచుకోని రోడ్డు
- అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వెళ్లలేని వైనం
- నిధులు మంజూరైనా పూర్తి కాని టెండర్లు



గ్రామ కచ్చా రహదారి

గ్రామ స్వరూపం..		
ఇళ్ల సంఖ్య 167	జనాభా 907	ఓటర్ల సంఖ్య 644
మొత్తం వార్డులు 8	తాగునీటి ట్యాంకులు 2	

అమరచింత: ప్రతి పల్లెకు రహదారి నిర్మించి రవాణా వ్యవస్థను పటిష్టం చేస్తున్న ఈరోజుల్లో ధర్మాపురం గ్రామం నేటికీ బీటీకి నోచుకోలేదు. మండలంలోని ధర్మాపురం గ్రామానికి ఇప్పటి వరకు కచ్చ రహదారికే పరిమితం కావడంతో ప్రజలు తమ ఊరి తలరాత ఎప్పుడు మారుతుందో.. రవాణా వ్యవస్థ ఎప్పుడు మెరుగుపడుతుందో అన్న సందేహాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం దాటినా ఇంకా కొన్ని పల్లెలకు రోడ్డు సౌకర్యం సరిగా లేదు. గ్రామంలో గర్భిణులు, ఇతర రోగుల అత్యవసర సేవల కోసం అందుబాటులో ఉండాల్సిన 108 వాహనం.. రోడ్డు సరిగా లేదనే కారణంతో ఈ గ్రామానికి అంబులెన్స్ వెళ్లమని చెప్పున్న దయనీయ స్థితిలో ప్రజలు ఉన్నారు.

చదువుకు ఆటంకమే..

ధర్మాపురం పాఠశాలలో బోధించేందుకు వచ్చే ఉపాధ్యాయులు సైతం రోడ్డు, రవాణా వ్యవస్థ సరిగా లేదనే కారణంతో ఇతర గ్రామాలకు బదిలీ చేసుకుంటున్నారు. దీంతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని గ్రామస్తులు తెలిపారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి తమ గ్రామానికి బీటీ వేస్తామని హామీలు ఇస్తున్న ప్రజాప్రతినిధులు ఎన్నికలు ముగిశాక ముఖం చాటేస్తున్నారు. గ్రామం నుంచి 75మంది విద్యార్థులు ఇతర పట్టణాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

ప్రయాణం నరకమే..

మండలంలోని ధర్మాపురం గ్రామానికి వెళ్లాలంటే ధర్మాపురం స్టేజీ నుంచి రెండున్నర కిలో మీటర్లు కచ్చ రహదారిపై ప్రయాణం చేయాల్సి ఉంది. దీంతో ద్విచక్రవాహనదారులు తప్ప, ఇతర వాహనాలు గ్రామంలోకి వెళ్లలేవు. కొందరు మూడేళ్ల నుంచి ఆటోలు నడుపుతుండటంతో గ్రామస్తులకు కాస్త ఊరట కలిగింది. కానీ అవికూడా రెండు, మూడే ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో వ్యవసాయ ట్రాక్టర్లను వినియోగించాల్సిన దుస్థితి ఉంది. చిన్నపాటి జ్వరం వచ్చినా.. ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న అమరచింత లేదా పది కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూర్‌కు వెళ్లాల్సిందే.

రూ.20 లక్షలు మంజూరు

గ్రామానికి బీటీ రహదారి కోసం కొన్నేళ్లుగా నిధులు మంజూరు చేస్తున్నారే తప్ప రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. అప్పటి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఏడేళ్ల కిందట రహదారి నిర్మాణం కోసం రూ.10లక్షలు మంజూరు చేయించారు. వీటికి టెండర్లు వేసిన సదరు కాంట్రాక్టర్ పనుల కోసం ముందుకు రాలేదు. దీంతో వచ్చిన నిధులు వెనక్కి వెళ్లాయి. మరోమారు రూ.20 లక్షలు రహదారి నిర్మాణానికి మంజూరు చేయించారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ ముందుకు సాగట్లేదు.

రోగమొచ్చినా ఇబ్బందే..



చిన్నపాటి జరం వచ్చినా గంటల తరబడి ఆటోల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. పిల్లలు చదువుకు ఇతర గ్రామాలకు వెళ్లాలన్న ఇబ్బందులే. గ్రామానికి రోడ్డు వేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఆ ఊసే లేదు.

– అనంతమ్మ, ధర్మాపురం

ఎమ్మెల్యేకు విన్నవించాం



గ్రామానికి రహదారి కోసం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులకు చెప్పినా పనులు ముందుకు సాగలేదు. రహదారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి ప్రతిసారి మాజీ ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేకపోయింది. గ్రామ ప్రధాన సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లా.

– గోపిరెడ్డి, మాజీ సర్పంచ్, ధర్మాపురం

టెండర్లు ఆహ్వానిస్తున్నాం

ధర్మాపురం గ్రామానికి రహదారి కోసం రూ.22 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరయ్యాయి. వీటికోసం టెండర్లు ఆహ్వానించాం. ఇప్పటి వరకు పనుల కోసం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మరోమారు టెండర్లను వేసి, పనుల పురోగతి కోసం చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఈఈ, పంచాయతీరాజ్

భగవద్గీతతోనే ఆధ్యాత్మిక చింతన



భగవద్గీత గ్రంథాల గురించి వివరిస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధకులు

కొత్తకోట రూరల్: భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన మొట్టమొదటి శ్లోకంలో జ్ఞానాన్ని గ్రహించేందుకు ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రబోధ సేవాసమితి కమిటీ కొత్తకోట, పెబ్బేరు మండలాల అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట పట్టణ సమీపంలో గల సాలెపేట కాలనీలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను గురించి కాలనీవాసులకు వివరించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయనం నందు 16వ శ్లోకంలో క్షర పురుషుడు అని జీవాత్మ గురించి, అక్షర పురుషుడు అని ఆత్మ గురించి 17వ శ్లోకంలో పురుషోత్తముడని జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల విధానంలో వివరించడంతో చాలా గొప్పగా త్రైత సిద్ధాంత భగవద్గీతలో వివరంగా రాశారన్నారు. భగవద్గీతను చదివిన వారు ధన్యులని తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పురుషోత్తం, శివ, జహంగీర్, వేణు, భాస్కర్‌రెడ్డి, రాములు, మహేశ్వరి, పద్మ తదితరులు ఉన్నారు.

బిర్సాముండాకు నివాళి



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: భారతీయ ఆదివాసీ ప్రజల తొలి పోరాట స్ఫూర్తి ప్రదాత బిర్సాముండా అని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఆదివారం బిర్సాముండా వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. అమాయకులైన గిరిజనుల్లో చైతన్యం నింపి తొలితరం స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పోరాట యోధుడు బిర్సాముండా అని కొనియాడారు. బ్రిటీష్ పాలకులను తరిమికొట్టేందుకు, ముండా రాజ్య స్థాపన కోసం బిర్సాముండా చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కవి గిరి రాజాచారి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, జిల్లా మైనార్టీ సంఘం నాయకులు బాలేమియా, జై భీమ్ సేవా సంస్థ నాయకుడు బండారి శ్రీనివాస్, నాయకులు గంధం లక్ష్మయ్య, కుశకుమార్, ఆంజనేయులు, రవి మూర్తి నాయుడు, రమేష్‌యాదవ్, శ్రీనివాసులు, అశ్విని, ఆంజనేయులు, విద్యార్థులు గౌతం యాదవ్, రాఘవేందర్ యాదవ్, తరుణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



వరద నీటిలో చిక్కుకున్న కారు

ఆత్మకూర్: పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. అమరచింత, ఆత్మకూర్ మధ్యలో 33 కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. విద్యుత్ సరఫరా కాకపోవడంతో స్థానికులు విద్యుత్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపు నీరు భారీగా చేరడంతో పలు వాహనదారులు డ్రెయినేజీలో పడి గాయాలపాలయ్యారు. సీసీరోడ్ల నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరగకపోవడం, గాంధీచౌక్‌లో డ్రెయినేజీ వద్ద కల్వర్టు నిర్మించకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

కార్పొరేషన్ రుణాలు అందించాలి



గిరిజనులతో మాట్లాడుతున్న నాయకులు

పాన్‌గల్: ఎస్టీ కార్పొరేషన్ పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని, గుడుంబా తయారీదారులకు ఉపాధి చూపాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఆయన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కార్పొరేషన్ రుణాలు నాలుగేళ్లగా పెండింగ్‌లో ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుడుంబా తయారీదారులకు ఉపాధి చూపకుండా ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడం సరికాదన్నారు. ఉపాధి చూయిస్తేనే గుడుంబా తయారీని అరికట్టవచ్చన్నారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న తండాలో విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలను నెలకొల్పాలని కోరారు. వాల సమస్యలను పరిష్కరించకపోతే గిరిజనులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హరినాయక్, నానునాయక్, బాబు నాయక్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశంలో సుస్థిర పాలన



చిన్నంబావిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



మదనాపురంలో..

చిన్నంబావి: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ధారాసింగ్ మాట్లాడుతూ దేశంలో ముప్పై పార్టీలు కలిపి ఒక్క బీజేపీని, నరేంద్రమోదీని ఎదుర్కోలేకపోయారని ఎద్దేవా చేశారు. దేశంలో అతిపెద్ద పార్టీగా బీజేపీని నిలిపినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు రావడం చాలా సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లో బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు అవకాశం ఇచ్చిన నరేంద్రమోదీకి, బీజేపీ కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి, కురుమయ్య, వెంకట్ రెడ్డి, రమణరెడ్డి, శేఖర్‌రెడ్డి, నరసింహగౌడ్, నాగేంద్రం, గోపాల్‌నాయుడు, కిరణ్‌కుమార్, సంపత్ కుమార్, రామకృష్ణరావు, లచ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ద్వారానే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లి రాజశేఖర్‌యాదవ్, కృష్ణయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బంగారు రవి, నాగరాజు, నితిన్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మర్రికుంటలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



సూగూరులో..

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని ఒకరికొకరు పలకరించుకొని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన ఆనాటి గురువులను రాఘవచారి, మునయ్య, నరసింహ, మద్దిలేటి, మల్లికార్జున్, పల్లా శ్రీనివాసులు శర్మ, నారాయణరావు, సాయిప్రకాష్, సుదర్శన్‌రెడ్డి, బైరోజ్ రాజశేఖర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నయాం, అశోక్, గంగాధర్, మధు పాల్గొన్నారు.

రాజనగరంలో..

వనపర్తి మండలంలోని రాజనగరం ప్రాథమికోన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పలువురు విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా వనపర్తి పట్టణంలోని మర్రికుంట సమీపంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో సమావేశమై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులు పిచ్చయ్య, యాదగిరి, చంద్రశేఖర్‌ను పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామా ప్రజలు కోరుతున్నారు. మూలమలుపుల వద్ద వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాలు అవుతున్నాయని పేర్కొన్నారు. నిత్యం వాహనాలు తిరుతున్నా మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సాయికుమార్

అమరచింత: అక్రమంగా అధిక ఫీజులు, పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏబీవీపీ నాయకులతో కలిసి ఆయన ప్రైవేట్ పాఠశాలల దోపిడి వ్యవహారంపై ఏబీవీపీ విద్యార్థి సంఘం ద్వారా తీసుకోవాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తూ వివిధ రకాల పేర్లతో అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 1994లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని చెప్తున్నా వాటిని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాటించకుండా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారన్నారు. 2009లో వచ్చిన జీఓ నంబర్ 91 ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈటెక్నో, డిజిటల్ టాలెంట్, ఒలింపియాడ్ అనే బ్రాండ్ పేరుతో పాఠశాల నడపొద్దని నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అధిక ఫీజుల వసూళ్ల దోపిడిని అరికట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ అఖిల్, రాజేష్, ఆదిత్య, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'బడిబాట' కార్యక్రమం



కొంకన్‌వానిపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



పాన్‌గల్ మండలం దావాజిపల్లిలో..



చీకురుచెట్టుతండాలో..

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బలరాముడు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలతో కలిసి కొంకన్‌వానిపల్లి, పాంరెడ్డిపల్లి గ్రామాల్లో బడిమానిన విద్యార్థులను గుర్తిస్తూ వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం కరుణాకర్, సీఆర్‌పీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: బడిఈడు కలిగిన ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు కిష్టాపూర్ తండా, దావాజిపల్లి గ్రామాల్లో పాన్‌గల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో బడిబాటపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బడిఈడు కలిగిన పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రాథమిక స్థాయి పూర్తైన విద్యార్థులను మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, పాఠ్య, నోటు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్నభోజనం వంటివి ఉచితంగా అందిస్తూ ప్రైవేటుకు దీటుగా బోధన సాగుతుందన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. పెద్దమందడి మండలంలోని చీకురుచెట్టుతండా, చిమనగుంటపల్లి గ్రామాల్లో బలిజపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మంజులత ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దామని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, రూ.వేలు ఖర్చుచేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పిడం కంటే మెరుగైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.